
తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 76 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ సోమవారం 21 -10-2024 వెల: 5/రూ -



## సమీక్షలు పూర్తి.. నిర్ణయమే తరువాయి

**జీవో 317పై సీఎంకు తుది నివేదిక ఇచ్చిన మంత్రివర్గ ఉపసంఘం**

**స్థానికత ఆధారంగా ఉద్యోగుల కేటాయింపుపై కీలక సూచనలు**

**స్పౌజ్, మ్యూచువల్, అనారోగ్య సమస్యల కేటగిరీ దరఖాస్తులకు త్వరలో మోక్షం!**

హైదరాబాద్: రాష్ట్రంలో నూతన జోనల్ విధానం మేరకు ఉద్యోగుల కేటాయింపులపై వచ్చిన వినతుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం పరిశీలన పూర్తయింది.

2లో

# గ్రూప్-1 మెయిన్స్‌పై పట్టువీడని సర్కారు

**వాయిదా కోసం అభ్యర్థులు,నిరుద్యోగుల డిమాండ్.. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం**

**తమకు అన్యాయం జరుగుతుందంటూ మళ్లీ రోడ్డెక్కిన అభ్యర్థులు**

**అభ్యర్థులకు బాసటగా ప్రతిపక్షాలు.. వాయిదా వేస్తే నష్టమేంటనే ప్రశ్నలు**

**అన్యాయం జరగకపోతే ఆందోళనలను ఎందుకు అణచివేస్తున్నారన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**భేషజాలకు పోకుండా వాయిదా వేయాలని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్**

**ఎవరికి నష్టం జరగదని టీపీసీసీ చీఫ్‌గా భరోసా ఇస్తున్నానన్న మహేశ్‌గౌడ్**

**పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసిన టీజీపీఎస్సీ**

**పరీక్షల వాయిదాపై పిటిషన్‌ను నేడు విచారించనున్న సుప్రీంకోర్టు**

హైదరాబాద్: .. గ్రూప్%-%1 మెయిన్స్ పరీక్షల విషయంలో ఇరుపక్షాలు పట్టువీడని పరిస్థితి. పరీక్షలను వాయిదా వేయాల్సిందేనంటూ నిరుద్యోగులు, అభ్యర్థులు ఓ వైపు ఆందోళనలను కొనసాగిస్తుండగానే.. మరోవైపు పరీక్షల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసేసింది. జీవో 29 కారణంగా రిజర్వుడ్ కేటగిరీల వారికి నష్టం జరుగుతుందని అభ్యర్థులు మొత్తుకుంటుంటే.. అలాంటిదేమీ లేదంటూ ప్రభుత్వం ముందుకెళుతోంది. ఎట్టి పరిస్థితుల్లో పరీక్షలు వాయిదా వేయాల్సిందేనంటూ ఆదివారం నిరుద్యోగులు, అభ్యర్థులు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ చౌరస్తాలో బైఠాయించినా..



2లో



2లో

## ఇందిరమ్మ ఇళ్ల అర్హులను తేల్చనున్న యాప్

**ఇప్పటికే ప్రధానమంత్రిఆవాస్ యోజనకు ఉపయోగిస్తున్న కేంద్రం**

**ఆ యాప్‌నే వినియోగించనున్న రాష్ట్ర ప్రభుత్వం**

**పట్టణ ప్రాంత లబ్దిదారుల ఎంపికకు మరో యాప్**

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తుదారుల్లో ఎవరు అర్హులు..ఎవరు కాదు అన్న విషయాన్ని ఓ యాప్ తేల్చనుంది. అర్హత ఉంటే దరఖాస్తు ప్రాసెస్ ముందుకు సాగుతుంది..లేకుంటే డిలీట్ అవుతుంది. రాష్ట్ర అధికారులు ఈ యాప్ ఆధారంగా త్వరలో సర్వే ప్రారంభించబోతున్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ కాదు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు దీన్ని తయారు చేసింది.

2లో




## నయా చాంప్ న్యూజిలాండ్

**తొలిసారి టీ20 ప్రపంచకప్ కైవసం**

**ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఘన విజయం**

**అమేలియా ఆల్‌రౌండ్ ప్రదర్శన**



2లో

## ఫోర్ బ్రదర్స్ కోసమే ఫ్యూచర్‌సిటీ

**సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబంపై కేటీఆర్ ధ్వజం**

**వారి 'రియల్'వ్యాపారం కోసమే ఈ ఎత్తుగడ**

**ఫార్మా సిటీ రద్దు చేస్తే రైతుల భూములు తిరిగివ్వాలి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన నలుగురు సోదరుల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే ఫ్యూచర్ సిటీ నాటకం ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రీన్ ఫార్మా ఏర్పాటు కోసం 14 వేల ఎకరాలు సేకరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా సిటీ రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి

## ఇదేమి రాజ్యం బాబూ?

**చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్**

**శాంతి భద్రతల పరిరక్షణలో కూటమి సర్కారు దారుణ వైఫల్యం**

**బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకపోతున్నారు**

**రాష్ట్రంలో రోజూ ఏదో ఒకచోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు**

**ఒక పాలకుడు ఉన్నాడని ప్రజలు ధైర్యంగా ఉండాల్సిందిపోయి నిరంతరం భయపడే స్థాయికి తీసుకెళ్లారు**

**మా పథకాలను, కార్యక్రమాలను ఎత్తివేస్తూ రాష్ట్రం, ప్రజల మీద బాబు కక్ష సాధింపు**

**బాలికలు, మహిళల భద్రతకు పూర్తి భరోసానిస్తూ దిశ యాప్ తెచ్చి 31,607 మందికి రక్షణ కల్పించాం**



అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్‌లో కాలేజీ విద్యార్థినిపై పెట్రోలు పోసి నిప్పంటించి ప్రాణాలు తీసిన ఘటనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఇదేమి రాజ్యం చంద్రుబాబూ..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని, అరాచక శక్తుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా జగన్ కూటమి ప్రభుత్వాన్ని ఆదివారం కడిగిపారేశారు.

# సమీక్షలు పూర్తి.. నిర్ణయమే తరువాయి



(మొదటి పేజీ తరువాయి)

వినతులపై పలుమార్లు సమీక్షలు నిర్వహించడంతో పాటు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి సూచనలు పరిగణనలోకి తీసుకుని రూపొందించిన నివేదికను ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి సమర్పించింది. రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా ప్రభుత్వం ఉద్యోగుల కేటాయింపులు జరిపేందుకు జీవో 317ను తీసుకొచ్చింది. ఈ ఉత్తర్వుల ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలు ఉద్యోగుల కేటాయింపులు జరిపాయి. జిల్లా, జోనల్, మల్టీజోనల్ కేడర్లలోని ఉద్యోగులను జీవో 317 ప్రకారం కేటాయించారు. అయితే స్థానికతను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా కేటాయింపులు జరపడంతో తీవ్రంగా నష్టపోయామనే భావనతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు న్యాయపోరాటానికి దిగారు. దీంతో గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో జీవో 317 బాధితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. తర్వాత అధికారంలోకి రావడంతో దీనిపై ప్రత్యేకంగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కమిటీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ప్రభుత్వ శాఖలతో పలుమార్లు సమావేశమైంది. అదేవిధంగా ప్రత్యేక వెబ్‌పోర్టల్ ద్వారా ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించింది. వాటిని ఆయా శాఖలకు పంపడంతో పాటు, సమస్యాత్మకంగా లేని వాటిని పరిష్కరించడానికి చర్యలు చేపట్టింది. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయాలు తీసుకోవాల్సినవి, కొన్ని ఇతర స్థాయిలోనివి మినహా మిగిలిన దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు, సూచనలతో నివేదిక ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు వివిధ వర్గాల నుంచి సేకరించిన అభిప్రాయాలతో రూపొందించిన నివేదికను దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు.. ముఖ్యమంత్రికి సమర్పించారు.

**ఆ మూడు కేటగిరీలకు ఉపశమనం!**

ముడు కేటగిరీల్లోని ఉద్యోగులకు సత్వర ఉపశమనం కల్పించాలని కమిటీ ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. స్పౌజ్, పరస్పరం (మ్యూచువల్), అనారోగ్య సమస్యల కేటగిరీలకు సంబంధించినవి దాదాపు 4 వేల వరకు దరఖాస్తులు ఉండగా.. వాటన్నింటినీ పరిష్కరించాలని సూచించినట్లు తెలిసింది. ఈ క్రమంలో వారం, పదిరోజుల్లో ఈ మూడు కేటగిరీల వారికి ఉపశమనం లభించనుంది. ఇక స్థానికత విషయంలో పలు అభ్యంతరాలు వచ్చాయి. అయితే కొత్త జిల్లాల నేపథ్యంలో జరిగిన మార్పులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, వారి స్థానికతను కూడా నిర్ధారించాలని సూచించినట్లు తెలిసింది. మిగిలిన కేటగిరీలకు సంబంధించి పలు సూచనలు కూడా చేసినట్లు సమాచారం. వెబ్‌పోర్టల్‌కు వచ్చిన దరఖాస్తులన్నీ సంబంధిత ప్రభుత్వ శాఖలకు అందగా.. వాటిని ఆయా శాఖల ఉన్నతాధికారులు ఇప్పటికే పరిశీలించి కేటగిరీల వారీగా విభజించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. కాగా ఈ నెల 26న జరిగే కేబినెట్ భేటీలో ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

# గ్రూప్-1 మెయిన్స్‌పై పట్టువీడని సర్కారు

(మొదటి పేజీ తరువాయి)

గాందీభవన్ ముట్టడికి ప్రయత్నించినా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఆందోళన చేస్తున్నవారిని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. కనీసం అభ్యర్థులు ప్రెస్‌మీట్ పెట్టి తమ ఆవేదన చెప్పుకొనేందుకు కూడా అనుమతించలేదు.

**ప్రతిపక్షాల మద్దతుతో..**

ఆందోళన తెలుపుతున్న అభ్యర్థులు, నిరుద్యోగులకు ప్రతిపక్షాలు బాసటగా నిలిచాయి. గ్రూప్%-%1 పరీక్షలు వాయిదా వేస్తే ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమిటని బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రశ్నించారు. పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్నికలకు ముందు అశోక్‌నగర్‌కు వచ్చిన రాహుల్‌గాంధీ నిరుద్యోగ యువతకు చెప్పిందేమిటి? కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పుడు చేస్తోందేమిటని నిలదీశారు. ఇక బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ కూడా ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోవడం ఎందుకని, పరీక్షలను వాయిదా వేసి తప్పులను సరిదిద్దితే వచ్చిన నష్టమేంటని నిలదీశారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపికలో ఏ ఒక్క వర్గానికీ నష్టం జరగలేదని, భవిష్యత్తులోనూ నష్టం జరగకుండా చూస్తానని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో భరోసా ఇస్తున్నానని ప్రకటించారు. ఇక నిరుద్యోగుల ఆందోళనలను పట్టించుకోకుండా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సోమవారం నుంచి గ్రూప్%-%1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. అభ్యర్థుల ఆందోళనల నేపథ్యంలో.. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగేందుకంటూ పరీక్షా కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



**నేడు సుప్రీంకోర్టులో విచారణ**

గ్రూప్%-%1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలంటూ నిరుద్యోగులు, అభ్యర్థులు వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరపనుంది. అటు విద్యార్థుల ఆందోళన, ఇటు రాష్ట్ర ప్రభుత్వ పట్టుదల మధ్య.. కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుందన్నది ఉత్కంఠగా మారింది.

# నయా చాంప్ న్యూజిలాండ్




అక్టోబర్ 20, 2024..న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలో మరువరాని రోజు. ఓవైపు పురుషుల జట్టు 36 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో భారత్‌పై టెస్టుల్లో చారిత్రక విజయం సాధిస్తే..మరోవైపు తామేం తక్కువ కాదన్నట్లు మహిళలు కొత్త చరిత్ర లిఖించారు. ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న టీ20 ప్రపంచకప్ టోర్నీని ఎట్టకేలకు ఒడిసిపట్టుకున్నారు. మెగాటోర్నీకి ముందు వరుస పరాజయాలతో కనీసం లీగ్ దశనైనా దాటుతుందా అన్న అంచనాలను తలక్రిందులు చేస్తూ పొట్టి ప్రపంచకప్‌లో నయా చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం ఫైనల్లో నిరుటి రన్నరప్ దక్షిణాఫ్రికాను మట్టికరిపిస్తూ కివీస్ తొలిసారి ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడింది. అమెలియా కెర్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో కివీస్ చారిత్రక విజయంలో కీలకమైంది.

దుబాయ్: న్యూజిలాండ్ మహిళల జట్టు కొత్త చరిత్ర లిఖించింది. కలగా మిగిలిన ఐసీసీ ట్రోఫీని ఎట్టకేలకు నెరవేర్చుకుంది. ఆదివారం జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్ 32 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. తొలుత న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 158/5 స్కోరు చేసింది. అమెలియా కెర్(38 బంతుల్లో 43, 4ఫోర్లు), బ్రూక్ హాలిడే(38), సుజి బేట్స్ (32) రాణించారు. మాల్బా(2/31)రెండు వికెట్ల తీయగా, కాకా, ట్రైయాన్, డికెర్ల్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 126/9 స్కోరుకు పరిమితమైంది. అమెలియా కెర్ (3/24), రోసిమెరీ(3/25) మూడు వికెట్లతో సఫారీల పతనాన్ని శాసించారు. కెప్టెన్ లారా వోల్వార్డ్(33) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. ఛేదనలో తొలుత దూకుడుగా ఆడిన దక్షిణాఫ్రికా..లారా నిష్క్రమణ తర్వాత వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి మరోమారు తాము చోకర్స్ అని చేతల్లో చూపెట్టింది. అమెలియా కెర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' దక్కించుకుంది. 2009, 2010లో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ ఎట్టకేలకు 14 ఏండ్ల తర్వాత తమ చిరకాల కలను సాకారం చేసుకుంది.

**కెర్ ఆల్‌రౌండ్ షో:**

అంచనాలు లేకుండా బరిలోకి దిగి న్యూజిలాండ్ అద్భుతం చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్..సమిష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. 16 పరుగులకే జార్జియా(9) వికెట్ కోల్పోయిన కివీస్..బేట్స్, కెర్ బ్యాటింగ్‌తో గాడిలో పడింది. వీరిద్దరు సఫారీ బౌలింగ్ దాడిని సమర్థంగా నిలువరిస్తూ పరుగులు కొల్లగొట్టారు. రెండో వికెట్‌కు వీరిద్దరు కలిసి 37 పరుగులు జోడించారు. కెప్టెన్ డివైన్(6) నిరాశపరిచినా..బ్రూక్‌తో కలిసి కెర్ ఇన్నింగ్స్‌ను మళ్లీ చక్కదిద్దింది. సమయోచిత ఆటతీరుతో స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేసింది. 14 పరుగుల తేడాతో వీరద్దరు ఔటైనా కివీస్ పోరాడే స్కోరు అందుకుంది.

**సంక్షిప్త స్కోర్లు**

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 158/5(కెర్ 43, బ్రూక్ 38, మాల్బా 2/31, డిక్లెర్క్ 1/17), దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 126/9(వోల్వార్డ్ 33, బ్రిట్స్ 17, కెర్ 3/24, రోసిమెరీ 3/25)

# ఫోర్ బ్రదర్స్ కోసమే ఫ్యూచర్‌సిటీ

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్ సిటీ అని చెప్పుకొని రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసి దండుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బొంగ్లూర్ సమీపంలో ఆదివారం నిర్వహించిన అలయ్‌బలయ్ (దసరా సమ్మేళనం) కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఫార్మా సిటీని రద్దు చేస్తే రైతుల నుంచి తీసుకున్న భూములు తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. త్వరలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఫార్మాలో భూములు కోల్పోయిన 9 గ్రామాల్లో పర్యటించి రేవంత్‌రెడ్డి చేస్తున్న మోసాలను ప్రజలకు విడమరిచి చెబుతామన్నారు. పండుగలన్నీ కల తప్పాయి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బతుకమ్మ పండుగకు చీరలు లేవని, దసరా పండుగ కళ తప్పిందని, వినాయక చవితి కూడా పండుగలా లేదని కేటీఆర్ దుయ్యబట్టారు. ప్రభుత్వంలోకి రాక ముందు రేవంత్‌రెడ్డి మూడు పంటలకు రైతుబంధు ఇస్తానని చెప్పాడని, అయితే, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాత్రం ఖరీఫ్‌కు పైసలు లేవని చెప్పడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్ అంటేనే భారత రైతు సమితి అని అభివర్ణించారు. చిట్టినాయుడు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడంతోనే సరిపోయిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితారెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్టు జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పెట్టిన పోస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రుణమాఫీ చేసినట్టు ఇచ్చిన ప్రకటనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించిన చిత్రాన్ని వాడిన రీతిలోనే రుణమాఫీ జరిగిన రైతుల లెక్క విషయంలోనూ ముఖ్యమంత్రి ఏఐ టెక్నిక్ వాడారంటూ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పేర్కొన్న 40 లక్షల మంది రైతులు అనే సంఖ్య ఏఐ (ఎనుముల ఇంటెలిజెన్స్)తో రేవంత్‌రెడ్డి రూపొందించిందేనని ఎద్దేవా చేశారు. మలేషియా తెలంగాణ అసోసియేషన్ ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే దశాబ్ది ఉత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆ అసోసియేషన్ ఆహ్వానించింది. నవంబర్ 9వ తేదీన మలేయాలోని కౌలాలంపూర్‌లో జరిగే ఈ ఉత్సవాలకు అక్కడి తెలంగాణవాసులు పెద్దఎత్తున హాజరవుతారని తెలిపింది. కేటీఆర్‌ను ఆయన నివాసంలో మలేయా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి, మాజీఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కలిసింది.

# ఇదేమి రాజ్యం బాబూ?

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడలేకపోతున్నారు. మహిళలు, బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకుపోతున్నారు. ఇదేమి రాజ్యం చంద్రబాబూ? రోజూ ఏదోచోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు సర్వసాధారణమైపోయాయి. బద్వేలులో కాలేజీ విద్యార్థినిపై పెట్రోలు పోసి నిప్పు అంటించి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం, దుర్మార్గం. బాధిత కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నా. ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం కూడా ఉంది. ఒక పాలకుడు ఉన్నాడంటే ప్రజలు ధైర్యంగా ఉండాల్సిందిపోయి నిరంతరం భయపడే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ మీద కక్షకొద్దీ మా పథకాలను, కార్యక్రమాలను ఎత్తివేస్తూ రాష్ట్రం, ప్రజలమీద చంద్రబాబు కక్ష సాధిస్తున్నారు

ఇది అన్యాయం కాదా? వైఎస్సార్‌సీపీ హయాంలో మహిళలు, బాలికల భద్రతకు పూర్తి భరోసానిస్తూ తీసుకొచ్చిన విప్లవాత్మక 'దిశ' కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా నీరుగార్చడం దీనికి నిదర్శనం కాదా? తద్వారా మహిళల భద్రతను ప్రశ్నార్థకం చేసిన మాట వాస్తవం కాదా? 'దిశ' యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కినా, చేతిలో ఉన్న ఫోన్‌ను ఐదుసార్లు అటూ ఇటూ ఊపినా వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, అక్కడ నుంచి దగ్గర్లో ఉన్న పోలీసులకు సమాచారం వెళ్తుంది. వెంటనే పోలీసులు వారికి ఫోన్ చేస్తారు. ఫోన్ ఎత్తకపోయినా లేదా ఆపదలో ఉన్నట్లు ఫోన్లో చెప్పినా ఘటనాస్థలానికి నిమిషాల్లో చేరుకుని రక్షణ కల్పించే పటిష్ట వ్యవస్థను మీరు (చంద్రబాబు) ఉద్దేశపూర్వకంగా నీరుగార్చలేదా? 'దిశ' ప్రారంభం నుంచి 31,607 మంది మహిళలు, బాలికలు రక్షణ పొందితే దాన్ని ఎందుకు దెబ్బతీశారు చంద్రబాబూ? 1.56 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకుని భరోసా పొందుతున్న 'దిశ'పై రాజకీయ కక్ష ఎందుకు? దిశ కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేకంగా 13 పోక్సో కోర్టులు, 12 మహిళా కోర్టులు, ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశాం. ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాం. 900 బైక్‌లు, 163 బొలేరో వాహనాలను 'దిశ' కార్యక్రమం కోసమే పోలీసులకు అందించి పెట్రోలింగ్‌ను పటిష్ట పరిచాం. 18 'దిశ' పోలీస్‌స్టేషన్లను నెలకొల్పి 18 క్రైమ్ మేనేజ్‌మెంట్ వాహనాలను సమకూర్చాం. వీటిని పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశాం. మా హయాంలో శాంతి భద్రతలపై నేను నిర్వహించిన సమీక్షల్లో 'దిశ' కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. దీంతో పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండేవారు. వీటన్నింటినీ నిర్వీర్యంచేసి ఏం సాధించాలనుకుంటున్నారు చంద్రబాబూ? ఇవాళ మీరు చేస్తున్నదల్లా మహిళల రక్షణ, సాధికారత కోసం అమలవుతున్న కార్యక్రమాలను, స్కీమ్‌లను ఎత్తివేయడం! ఇసుక, లిక్కర్ లాంటి స్కామ్‌లకు పాల్పడుతూ పేకాట క్లబ్బులు నిర్వహించడం! పోలీసు వ్యవస్థ కూడా అధికారపార్టీ అడుగులకు మడుగులొత్తుతూ ప్రతిపక్షంపై తప్పుడు కేసులు బనాయిస్తూ వేధింపులకు దిగడమే పనిగా పెట్టుకుంది. మహిళలు, బాలికలు, చిన్నారుల రక్షణ బాధ్యతలను విస్మరించింది.

## ఇందిరమ్మ ఇళ్ల అర్హులను తేల్చనున్న యాప్

దానినే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వినియోగించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు చొప్పున మంజూరు చేసి రాష్ట్రవ్యాప్తంగా 4.16 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మొదటిదశలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది చివరలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా ఇప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించే కార్యక్రమం చేపట్టబోతున్నారు. దీనికి సంబంధించి దసరా ముందు రోజు ఇందిరమ్మ కమిటీ మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. గ్రామ, పట్టణ స్థాయి కమిటీలను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీ సభ్యులు ఇందిరమ్మ పథకానికి అర్హులను తేల్చటంలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంది. ఇందులో ఈ కమిటీ సభ్యుల కంటే.. ఓ యాప్ మరింత క్రియాశీలంగా వ్యవహరించబోతోంది.


# పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థంలో కట్టడాలు

## అమరవీరుల పేర్లతో పోలీస్ హెడ్ క్వార్టర్ లో పలు భవనాలు.

## రాష్ట్రంలోనే మొదటిసారిగా జిల్లాలో అమరవీరుల కుటుంబాలకు కాలనీ








**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :** ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల అలజడి, ఉగ్రవాద చర్యలు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పి ఉన్నదంటే ఒకప్పటి పోలీసుల త్యాగ ఫలితమే ప్రధాన కారణం. ఒకప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో నిరంతరం మావోయిస్టులు, పోలీసుల మధ్య తరచూ ఎదురుకాల్పులు, రక్తపు మరకలతో అట్టుడిగి పోయేది. జిల్లా అభివృద్ధి కుంటుపడి అనేక సమస్యలతో ప్రజలు సతమతమయ్యేవారు. మావోయిస్టులను జిల్లా నుండి తరిమి వేయడమే పోలీసుల ప్రధానమైన లక్ష్యంగా ఉండేది. అత్యధిక శాతం పోలీసులు అడవుల్లోనే ఉంటూ మావోయిస్టుల ఏరివేతలో గాలింపు చర్యలు చేపట్టుతూ, అడవులను జల్లెడ పడుతూ ఉండేవారు. పల్లె గ్రామాల ప్రజలు ఎప్పుడూ ఏమి జరుగుతుందనే భయం, ఆందోళనతో జీవనం సాగించేవారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇటు ప్రజలతో సత్సంబంధాలు పెంచుకుంటూ, మావోయిస్టులపై పట్టు సాధించడానికి అనేక కార్యకలాపాలు చేపట్టేవారు. అప్పటి పోలీసుల ఏకైక లక్ష్యం, ప్రజల కోసం, శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా సిద్ధమయ్యేవారు. రాజ్యాంగ రక్షణకై ప్రజాస్వామ్య పరిరక్షణకై, సమాజ శ్రేయస్సుకై, అహర్నిశలు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉగ్రవాద, తీవ్రవాద చర్యలను ఎదుర్కొంటూ సంఘవిద్రోహ శక్తుల నుండి ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకై ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి రాజీలేని పోరాటం చేస్తూ, అసువులు బాసిన అమర వీరులకు ప్రతి ఏటా జిల్లాలో అక్టోబర్ 15 నుండి 21 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరుపుకుంటారు. 1981 నుండి 1995 వరకు సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ 48 మంది పోలీసులు అమరులైనారు. జిల్లా పోలీసులు ఒక అడుగు ముందుకు వేసి వారోత్సవాల సందర్భంగానే కాకుండా ప్రతిరోజు అమరవీరుల పేర్లు చలామణిలో ఉండాలనే ఉద్దేశంతో పోలీస్ హెడ్ క్వార్టర్ లో పలు భవనాలకు, ఎన్ కౌంటర్ ఘటనల స్థలం, అమరవీరుల పేర్లతో పిలుస్తుంటారు.




**ఆలంపల్లి కాంప్లెక్స్..**

1987 సంవత్సరంలో కడెం మండలం ఆలంపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య భీకరమైన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఎస్సైలతో సహా 11 మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారు. ఆలంపల్లిలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి మావోయిస్టుల గాలింపు చర్యలు చేపడుతున్న సమయంలో, మావోయిస్టులు పన్నాగంతో పోలీసులను రప్పించి పైశాచికంగా తుపాకులతో కాల్చారు. ఉమ్మడి జిల్లాలో ఇదే అతిపెద్ద ఎన్ కౌంటర్, ఈ ఘటన జ్ఞాపకార్థం పోలీస్ హెడ్ క్వార్టర్ లో మూడంతస్తుల భవనం నిర్మించి అలంపల్లి కాంప్లెక్స్ గా నామకరణం చేశారు.

**ఎస్సై కోట్యా నాయక్ చిల్డ్రన్ పార్క్.**

1991 సంవత్సరంలో ఉట్నూర్ ఎస్ఐ కోట్యా నాయక్ మావోయిస్టులతో పోరాడి అసువులు బాశారు. మావోయిస్టులు కుట్రతో ముందుగా కొమ్ము గూడ అటవీ ప్రాంతంలో బీడీ ఆకులు కాలబెట్టి ఇన్ఫార్మర్ తో పోలీసులకు సమాచారం అందించగా అప్పటి ఉట్నూర్ యువ ఎస్సై కోట్యా నాయక్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకోవడంతో, రోడ్డుకు ఇరువైపులా పేలుడు పదార్థాలు అమర్చి, కాల్పులు జరిపి అతి కిరాతకంగా హత్య చేశారు. ఈ ఘటనలో ఎస్సైతో పాటు మరో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు అసువులు బాశారు.



**చక్రపాణి మెమోరియల్ హాల్...**

1993 సంవత్సరంలో మంచిర్యాల్ సీసీసి నస్పూర్ వద్ద మావోయిస్టులు ఓ ఇంట్లో తల దాచుకున్నట్లు సమాచారం తెలుసుకొన్న అప్పటి శ్రీరాంపూర్ సర్కిల్ సీఐ చక్రపాణి తన గన్ మెన్ అశోక్ తో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మావోయిస్టులను అదుపులో తీసుకునే క్రమంలో మావోయిస్టులు ఇంటి పైకప్పు నుండి కాల్పులు జరిపి సీఐ చక్రపాణి, కానిస్టేబుల్ అశోక్ లపై తుపాకులతో కాల్పులు జరిపి హత్య చేశారు. జిల్లాలో మొదటిసారిగా సిఐ స్థాయి అధికారి మావోయిస్టుల దుశ్చర్యతో అమరుడైనఅందుకు పోలీస్ సమావేశ మందిరం నిర్మాణం చేసి ఆయన జ్ఞాపకార్థం "చక్రపాణి మెమోరియల్ హాల్" పేరుతో నామకరణం చేశారు.

**శేషు, సంజీవ్ పేర్లతో వ్యాయామశాల**

2000 సంవత్సరంలో బెల్లంపల్లి, మంచిర్యాల్ తదితర సింగరేణి ప్రాంతాల్లో మావోయిస్టుల కార్యకలాపాల నిర్వహణ బాధ్యత సికాస సంస్థ చేపట్టేది. మావోయిస్టుల ఏరివేతలో ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు శేషు, సంజీవ్ కీలక పాత్ర పోషించేవారు. మావోయిస్టులు ఇద్దరిని టార్గెట్ చేసి తుపాకులతో కాల్చి హత్య చేశారు. వీరి ఇద్దరి జ్ఞాపకార్థం పోలీస్ హెడ్ క్వార్టర్ లో వ్యాయామశాల నిర్మాణం చేపట్టి నామకరణం చేశారు.

**పోలీస్ అమరవీరుల కాలనీ**

2015 సంవత్సరంలో పోలీస్ అమరవీరుల కుటుంబాల కోసం స్థానిక పిట్టల్ వాడా కాలనీలో ఏకంగా కోటి రూపాయల వ్యయంతో 48 మంది కుటుంబాల నివాసం కోసం కాలనీ ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న, జిల్లా ఎస్పీలు తరుణ్ జోషి, గజరావు భూపాల్, అదనపు ఎస్పీ టి. పనసారెడ్డి కృషితో స్థలం కేటాయించి, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి నివాసం కోసం నిర్మాణాలు చేపట్టి, పోలీస్ అమరవీరుల కాలనీగా నామకరణం చేసి ప్రారంభించారు.



## ఘనంగా నిండు కలశాల ఊరేగింపు మహోత్సవం

**రాయికోడ్ ,అక్టోబర్ 20 ( డైలీ రిపోర్ట్):** సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లోని హనుమాన్ మందిరం పునఃప్రారంభం మహోత్సవంలో భాగంగా ఆదివారం మూలవిరట్ ఆంజనేయస్వామికి మాన్యుసూక్తముచే అభిషేకం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్దలతో భజన చేసుకుంటూ ప్రతి ఇంటినుండి మహిళలు నిండుకలశాలను తీసుకువచ్చి డప్పుచప్పుళ్ల మధ్య పురవిధులగుండా ఊరేగింపు నిర్వహించి దేవిదేవతలకు అభిషేకం చేయడం జరిగింది, అలాగే అర్చకులు స్వస్తి వాచనము, మంటప దేవత హెూమం,మహా గణపతిహెూమం,పురుషాసుక్త,శ్రీసూక్త,రుద్ర,మాన్య హెూమం,దేవత విగ్రహాలకు స్థాపాణము,శ్యయది వాసము,పుష్ప పలది వాసము, మహాహారతి ఇచ్చి తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

## మృతురాలి కుటుంబానికి అండగా ఉంటాం

### మానుకోట ఎంపీ పోరిక బలరాం నాయక్



మహబూబాబాద్,అక్టోబర్ 20(డైలీ రిపోర్ట్): మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి శివారు మేఘ్య తండాకు చెందిన లకావత్ మౌనిక (23) శనివారం మధ్యాహ్నం పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సమాచారం తెలుసుకున్న మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి,కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి,అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో వారు ఫోన్ ద్వారా మాట్లాడి ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. వారి వెంట కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి,టిపిసిసి సభ్యులు దశ్రు నాయక్,సీనియర్ నాయకులు బండారు దయాకర్,చిదురాల వసంత్ రావు,వేముల శ్రీనివాస్ రెడ్డి,కేసముద్రం పట్టణ అధ్యక్షులు రావుల మురళి,కొరుకొండపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు సట్ల శ్రీనివాస్,ఉప్పరపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు నూకల వెంకన్న,నాయకులు భూలోక్ రెడ్డి,ఉపేందర్ రెడ్డి,బానోత్ వెంకన్న,తరాల సుధాకర్,బోడ విక్కి,ఎండి. తాజొద్దిన్,అరిగే విజేందర్,పరిపూర్ణ చారి,సందీప్,మెట్టు రవీందర్ రెడ్డి,పల్స రాకేష్,బైరి రాజు,ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు...

## అధిక దిగుబడి వరి వంగడం జ్యోతి

### తెగుళ్లను దోమపోటను తట్టుకునే రకం




మహబూబాబాద్/కొత్తగూడ, అక్టోబర్ 20(డైలీ రిపోర్ట్): మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లక్మీపురం గ్రామంలో ఇండస్ వ్యాలీ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి హైబ్రిడ్ వరి రకం జ్యోతి రైతు క్షేత్ర ప్రదర్శన నిర్వహించగా పలు గ్రామాలైన దుర్గారాం,లక్మి పురం,గుండ్రపల్లి, లడాయి గడ్డ,మైలారం,గ్రామాల నుండి దాదాపు 450 మందికి పైగా రైతులు జ్యోతి వరి వంగడం ప్రదర్శనలో పాల్గొని వీక్షించడం జరిగింది. జ్యోతి వరి రకం సాగు చేసిన రైతు మట్ట పల్లి రాజు మాట్లాడుతూ ఇండన్ వ్యాలీ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వరి రకం జ్యోతి సీడ్స్ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను,వైరస్ లను తట్టుకొని ఏపుగా పెరిగి గొలుసు భారీగా వచ్చిందని అన్నారు. వర్ష ప్రభావానికి పడిపోకుండా ఉందని, ముఖ్యంగా అన్ని రకాల తెగులను తట్టుకొని దిగుబడినిస్తుందని రైతు తెలిపారు. సుమారుగా ఎకరానికి 45 బస్తాలు దిగుబడి వస్తుందని అన్నారు. జ్యోతి వరిరకం ను చూసిన రైతులు చాలా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండస్ వ్యాలీ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి అల్లంనేని వాసు, ఓం శ్రీ ముసలమ్మ ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్,సీడ్స్ డిస్ట్రిబ్యూటర్ జంగాల వినయ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.




## టిజిఈఎపిసెట్ లో టిఎస్విడబ్ల్యూ ను ఎంపిక చేసుకోండి

### కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.స్వప్నరెడ్డి



**మహబూబాబాద్/కొత్తగూడ, అక్టోబర్ 20(డైలీ రిపోర్ట్):** 2024-2025 విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ సాంఘికసంక్షేమ గురుకుల మహిళ ఫార్మసి కళాశాలలో బి.ఫార్మసి ప్రవేశం కొరకు విద్యార్థులు టిజిఈఎపిసెట్ షెడ్యూల్ క్రమంలో ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు జరుగుతుందని, ధ్రువపత్రాల పరిశీలనంతరం కళాశాల ఎంపిక ప్రాతిపదికలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళ ఫార్మసి కళాశాల (టిజిఈఎపిసెట్)లో కళాశాల కోడ్ టిఎస్విడబ్ల్యూ మహబూబాబాద్ గా ఎంపిక చేసుకోగలరన్నారు. కళాశాల ఎంపిక ఈనెల 21వ తేదీనుండి 25వ తేది వరకు తొలివిడత, చివరివిడతలో భాగంగా వచ్చే నెల అనగా నవంబర్ 5వ తేదీ నుండి 6వ తేదీ వరకు జరుగుచున్నవని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.స్వప్నరెడ్డి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇచ్చోడ లో కొమరం భీమ్ చౌక్ వద్ద బి ఆర్ఎస్ ధర్నా

**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో.... రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 6 గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కొమరం భీమ్ చౌక్ వద్ద బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ ఇచ్చోడ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 6 గ్యారెంటీలను అమలు చేయాలని రైతు రుణమాఫీని వెంటనే వేయాలని లేకపోతే పార్టీ ఆదేశాల మేరకు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు , ఇచ్చోడ మండల బి నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# రైతు బంధు పై పలుమార్లు మాట తప్పిన ప్రభుత్వం..

## బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు

**మహబూబాబాద్/కొత్తగూడ, అక్టోబర్ 20(డైలీ రిపోర్ట్):** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. రైతు భరోసా అమలు చేయాలని వారు పెద్ద ఎత్తున నిరసన గలం వినిపించారు. దీంతో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను విరమించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెడుతూ అమలుకాని హామీలను ఇచ్చి తీర గద్దెనెక్కి హామీలు అమలుపరచకుండా అటూ ప్రజలను ఇటు రైతులను ప్రతీ వర్గాన్ని మోసం చేసిందని అన్నారు. రైతు భరోసాను ఎకరానికి రూ. 10000 నుండి రూ.15 వేల వరకు పెంచుతూ అమలు కాని హామీలు ఇచ్చి నేడు రైతులకు ఖరీఫ్ సీజన్ అయిపోతున్నా కూడా ఇంతవరకు ఒక రూపాయి కూడా అందించిన దాఖలాలు లేవని తెలిపారు. రైతులు ఇప్పుడా అప్పుడ రైతు బంధు వస్తుందని ఎదురుచూస్తున్న తరుణంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు భరోసా ఇప్పట్లో లేనట్లే అని చెప్పడం రైతులను నిండా మోసం చేయడమేనని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఎకరానికి15 వేల రూపాయల రైతు భరోసా వెంటనే అందించి వారిని ఆదుకోవాలని లేనిపక్షంలో రైతు భరోసాను అందించే వరకు పోరాడుతామని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి నెహ్రూ నాయక్,మాజీ ఎంపీపీ దారం స్వామి,మాజీ ఎంపీటీసీ మోకాళ్ళ సంతోషరాణి వెంకటేష్, నానుబోతుల స్వప్న లింగన్న,మాజీ సర్పంచ్ భూపతి తిరుపతి, బానోత్ వీరన్న, అజ్మీర రజిత రమేష్,సమయ్య, రవి,మండల నాయకులు గజ్జి రామన్న,గట్టయ్య, శ్రీను, పత్తిపాక వెంకన్న, గుంజేడు ముసలమ్మా ట్రస్ట్ బోర్డు మాజీ చెర్మన్ వాసం వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు రవి, పరమేష్,సంపత్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పట్టభద్రుని నోట ప్రసన్న హరికృష్ణ గెలుపు మాట



**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ గా ప్రస్తుతం కొనసాగుతున్న టీ. జీవన్ రెడ్డి పదవీ కాలం2025 మార్చి నెలలో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మొదటగా పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రక్రియను అక్టోబర్1 నుండి నవంబర్ 6 వరకు కొనసాగేలా ఉత్తర్వులు జారీచేసింది. 2025 ప్రారంభంలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో నిలిచేలా చాలా మంది ఆశావహులు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. రాజకీయ పార్టీలనుండే కాకుండా స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగేలా కొంతమంది విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు పక్క ప్రణాళికలతో అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే ఆశావహు అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఉమ్మడి నాలుగు జిల్లాల వ్యాప్తంగా జోరుగా సాగుతోంది. పట్టభద్రులను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహ అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో అందరికంటే ముందు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ ముందు వరుసలో ఉన్నారు. ఇప్పటికే నాలుగు ఉమ్మడి జిల్లాలలో సుడిగాలి పర్యటనలు చేశారు. ఈ నాలుగు జిల్లాలో తన పూర్వ విద్యార్థులు, తనతో కలిసి పనిచేసిన వారు, తన అభిమానులు పెద్ద సంఖ్యలో ఉండడం ప్రసన్న హరికృష్ణ కు కలిసి వస్తుంది. తాను ఏరోజు ఎక్కడ పర్యటిస్తున్నారో ముందుగానే సామాజిక మాధ్యమాలలో షేర్ చేస్తున్నందున తన పర్యటనను ముందే తెలుసుకుని ఆయన రాగానే స్వచ్ఛందంగా ప్రసన్న హరికృష్ణ ను కలుస్తూ తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నారు. పోటీ పరీక్షల శిక్షకుడిగా, విన్నర్స్ పబ్లికేషన్స్ సలహదారునిగా నిరుద్యోగుల సమస్యలు తెలిసిన వ్యక్తిగా, ప్రభుత్వ ఉద్యోగిగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలిసిన వ్యక్తిగా ప్రసన్న హరికృష్ణకు ఈ రెండు వర్గాలు తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నాయి. ఇలా ఇప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పరిధిలోని ప్రతి పట్టభద్రుని నోట ప్రసన్న హరికృష్ణ గెలుపు మాట వినిపిస్తుంది. తాను వెళ్లిన ప్రతి చోట అక్కడి పట్టభద్రుల నోట మీరు గెలిచిన తర్వాత మా దగ్గరే మొదట విజయోత్సవ సభలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రసన్న హరికృష్ణ గత 15 ఏళ్లుగా పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న లక్షలాది మంది అభ్యర్థులకు విన్నర్స్ పబ్లికేషన్స్ పుస్తకాల ద్వారా, మొటివేషనల్ స్పీచ్ ల ద్వారా సుపరిచితమే. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా గజ్వెల్ లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రసన్న హరికృష్ణ కు ఇంకా 19 ఏళ్ల సర్వీస్ కలదు. కానీ నిరుద్యోగ, ఉద్యోగ అభ్యర్థుల వినతి మేరకు త్వరలోనే తన ఉద్యోగానికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తన సన్నిహితుల ద్వారా తెలుస్తోంది.





## వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ మంత్రి,వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్

**సత్యసాయి జిల్లా, అక్టోబర్20(డైలీ రిపోర్ట్):** సోమందేపల్లి మండల వైసీపీ కన్వీనర్ షేక్ ఇమామ్ వలి కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించరు. మాజీ మంత్రి,వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్ శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి మండల కేంద్రంలో జరిగిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమందేపల్లి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జే సీ ఎస్ కన్వీనర్ షేక్ ఇమామ్ వలి కుమార్తె వివాహవేడుకలో మండల నాయకులతో పాటు మాజీ మంత్రి, సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు పెనుకొండ నియోజకవర్గం ఇన్ చార్జ్ కే.వి. ఉషాశ్రీచరణ్ పాల్లొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# అయ్యప్పల మహా పాదయాత్ర ప్రారంభం

## లోకహితమే లక్ష్యం!.. బిదారిపొడుగున భక్తుల నీరాజనం..

**సిద్దిపేట , (డైలీ రిపోర్ట్) , అక్టోబర్ 20 :** సిద్దిపేట కేంద్రం నుంచి అయ్యప్పల మహాపాదయాత్ర అంగరంగ వైభవంగా ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. కోటిలింగేశ్వర దేవాలయం ఆవరణలో స్వాములు అయ్యప్ప స్వామికి విశేష పూజలు చేశారు .భజనలు , అభిషేకాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. అయ్యప్ప గురుస్వాములు రాజు , మధుసూదన్ రెడ్డి, నాగరాజు , యాదవ రెడ్డిరెడ్డి , దుర్గా రెడ్డి స్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని యాత్రను ప్రారంభం చేశారు . సిరిసిల్ల , కరీంనగర్ , జగిత్యాల, హుస్నాబాద్ తదితర ప్రాంతాల నుంచి అయ్యప్పలు యాత్రలో చేరారు. పాదయాత్ర మెదక్ రోడ్ , నర్సాపూర్ చౌరస్తా ల మీదుగా సాగింది .దారి పొడుగున భక్తులు మంగళ హారతులతో అయ్యప్ప పాదయాత్రికులకు స్వాగతం పలికారు.బంధుమిత్రులు , అయ్యప్ప భక్తులు ఉత్సవంలో పాల్గొని అయ్యప్ప స్వాములకు ఘనంగా వీడ్కోలు పలికారు. అయ్యప్పల పాదయాత్ర తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ , కర్ణాటక, తమిళనాడుల , కేరళ మీదుగా శబరిమలైకి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. సుమారు 1440 కిలోమీటర్ల పాదయాత్ర జరుగుతుందన్నారు. లోక కళ్యాణం కోసం ఈ సాహస యాత్రను అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలతో చేస్తున్నట్టు ప్రకటించారు.











# పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమ్మేళనం






**2008-2009 డబిల్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పండగ వాతావరణం**

**ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించిన పూర్వవిద్యార్థులు**

**ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి సందడి చేశారు**

**వారి జీవన స్థితిగతులు పంచుకుని రోజంతా ఆనందంగా గడిపారు**






**మేడ్చల్ /సంగారెడ్డి/హైదారాబాద్ ,అక్టోబర్ 20 :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లోని డబిల్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు 15 సంవత్సరాల తరువాత ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు భాగ్య లక్ష్మి, అమరాజ్యోతి, పరిమిలా ,మాధవీ, విద్యాసాగర్, శ్రీనివాస్ ను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆనాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ 2008-2009 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరగడం చాలా ఆనందం అన్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులందరు 15 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకకోవడం మాకు చాలా ఆనందం కలిగించే అంశం అన్నారు. అలాగే విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలపడం చాలా సంతోషం అన్నారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల మాటల్లో...

బాల్య స్మృతులు తిరిగిరానివి. మళ్లీ బాల్య స్నేహితుల ముందు బాల్యంలోకి వెళ్లి మన జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం అంటే నిజంగా మళ్లీ బాల్యంలో జీవించినట్టే...! పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు పాఠశాలల అభివృద్ధికి ఆత్మీయ కలయికకు వేదిక అవుతున్నాయి. మీ అందరికీ అభినందనలు..

## విద్యార్థినీ,విద్యార్థుల మాటల్లో...

ప్రతి మనిషికి బాల్యం ఒక మధురమైన గతం..
అమాయకత్వానికి ప్రతి బింభం..

బాధ్యతల బంధంలో సాగిపోయే ప్రతి మనిషికి మనసు బాల్యం వెంట పరిగెడుతుంది.

వెన్నెల వెలుగంత స్వచ్ఛమైనది బాల్యం.. తలుచుకున్న కొద్ది ప్రియమైనది బాల్యం..

బహుశా తిరిగి రానిది, పోగొట్టుకున్నది, గడిచిపోయినది ఎదైనా ప్రియంగా, అపురూపంగా ఉంటుందేమో..

కోట్లు పెట్టి కొనాలనుకున్న రానిది బాల్యం,

మళ్లీ కోరుకున్న మరల రానిది ఈ జీవితం.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707